ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★

ఆదివారం 30 జూన్ 2024

బొగ్గు నిక్షేపాలను ప్రైవేట్‌పరం చేస్తే సహించం 8లో..

టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామమూర్తి 8లో..



జిల్లాపై పట్టు బిగింపు

- క్షేత్రస్థాయిలో కలెక్టర్ ఆకస్మిక పర్యటనలు
- నిర్లక్ష్యంపై కొరడా.. ముగ్గురు అధికారుల సస్పెన్షన్
- విద్య, వైద్యానికి ప్రాధాన్యం.. ధరణి సమస్యలపై దృష్టి
- ప్రతి రోజు ప్రజల కోసం రెండు గంటల కేటాయింపు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాకు నూతనంగా వచ్చిన కోయ శ్రీహర్ష జిల్లాపై పట్టు బిగిస్తున్నారు. విధుల్లో చేరిన నాటినుంచి జిల్లాలో సుడిగాలిలా పర్యటిస్తూ ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మండల కార్యాలయాలను తనిఖీ చేస్తూ వాటిని గాడిన పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ముగ్గురు అధికారులను సస్పెండ్ చేసి సంచలనం సృష్టించారు. విధుల పట్ల అప్రమత్తంగా లేకుంటే వేటు తప్పదనే సంకేతాలను ఇతరులకు ఇచ్చినట్లయ్యింది. కలెక్టర్ ఆకస్మిక తనిఖీలతో క్షేత్రస్థాయిలో అధికారులు, ఇతర ఉద్యోగులు బెంబేలెత్తి పోతున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహించకుండా ఉండేందుకు సమయ పాలన పాటిస్తూ అప్రమత్తంగా ఉంటున్నారు. ఈనెల 15వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల కలెక్టర్ల బదిలీలను చేపట్టింది. అందులో బాగంగా ఇక్కడ కలెక్టర్‌గా పని చేసిన ముజమ్మిల్‌ఖాన్ ఖమ్మం జిల్లాకు బదిలీ కాగా, నారాయణపేట్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న కోయ శ్రీహర్షను జిల్లాకు బదిలీ చేశారు. బదిలీ అయిన మరుసటి రోజే పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీహర్ష జిల్లాపై తనదైన మార్కును పదర్శించేందుకు శ్రీకారంచుట్టారు. జిల్లా పట్ల పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకునేందుకు, పట్టు సాధించేందుకు సుడిగాలిలా పర్యటిస్తున్నారు. ప్రతిరోజు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సివిల్ ఆసుపత్రులను సందర్శించేందుకు ఆకస్మికంగా వెళుతున్నారు. అన్ని శాఖలపై పట్టు సాధించేందుకు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యాన్ని ఇస్తున్నారు. ఈనెల 12వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కావడంతో ఆ పాఠశాలలను తనిఖీ చేస్తున్నారు. అక్కడ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు ఎంతవరకు పూర్తిచేశారు, తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజన పథకం అమలుతీరు, తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది ద్వారా అన్ని వివరాలు తెలుసుకుంటున్నారు.

వర్షాకాలం సీజన్ కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉండడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సివిల్ ఆసుపత్రులను సందర్శించి ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, పరిసరాల పరిశుభ్రత, డాక్టర్లు, సిబ్బంది ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలో తాను గమనించిన అంశాలన్నింటిపై చర్చించి చర్యలు తీసుకునేందుకు గాను కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ క్షేత్ర స్థాయిలో గమనించిన అంశాలను సమీక్షా సమావేశంలో చర్చించే సరికి సంబంధిత అధికారులు అవాక్కవుతున్నారు. సున్నితంగా సంబంధిత అధికారులకు చురకలు అంటిస్తున్నట్లు సమాచారం. రామగుండంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు చేపట్టిన పనుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఆర్‌అండ్‌బీ ఏఈ జావిద్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరవుతున్న జిల్లా భూగర్భ జల శాఖ అధికారిగా పనిచేస్తున్న కె రవిశంకర్, జిల్లా ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న ఎం సురేష్‌బాబులను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో భాగంగా సంబంధిత అధికారులు, ఉద్యోగులను ఆయా అంశాల గురించి ప్రశ్నించినప్పుడు సరైన జవాబులు చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు. వారి శాఖలకు సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని కూడా చెప్పలేక పోతున్నారు. ప్రధానంగా జిల్లాలో ధరణి సమస్యలతో సతమతం అవుతున్నట్లుగా కలెక్టర్ గుర్తించారు. ఇప్పటివరకు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉన్న ధరణి సెక్షన్ విభాగాన్ని కలెక్టరేట్‌లోకి తన ఛాంబర్ పక్కన గల వెయిటింగ్ హాల్‌లోకి తీసుక వచ్చారు. ధరణి సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

● పని దినాల్లో ప్రజల కోసం రోజూ రెండు గంటలు..

జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమమే గాకుండా ఆ రోజు మినహాయించి ప్రతి రోజు పనిదినాల్లో మంగళవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలు, ఇతరులు కలెక్టర్‌ను కలిసేందుకు అవకాశం కల్పించారు. ఈ సమయంలో కూడా తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌ను కలిసేందుకు అవకాశం కల్పించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను తానే స్వయంగా పరిశీలిస్తున్నారు. ఎప్పటికప్పుడు వాటిని సంబంధిత అదికారులకు పంపిస్తూ సమస్యను పరిష్కరించాలని ఆదేశిస్తున్నారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు చేసి వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చే వారి నుంచి బయటకు వచ్చి వినతి పత్రాలు స్వీకరిస్తున్నారు. దీంతో ప్రజల దృష్టి కలెక్టర్‌పై పడింది. జిల్లాలో నడుస్తున్న అక్రమ మట్టి, ఇసుక దందాలపై కూడా ఉక్కుపాదం మోపాలని ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.



కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రిని సందర్శిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష(ఫైల్)

రైతు బంధు పథకంపై అభిప్రాయ సేకరణ

- జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో ఆదిరెడ్డి

మంథని, జూన్ 29: రైతు బంధు పథకం కింద ఒక్కో పంట కాలానికి రూ.7500 చొప్పున రైతులకు ఆర్థిక సహాయం చేయడానికి సహకార సంఘ సభ్యులు, రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయాన్ని రాత పూర్వకంగా తీసుకున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. స్థానిక పీఏసీఎస్‌లో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం రైతు బంధు పథకంపై ప్రత్యేక మహా సభ నిర్వహించారు. ఐదెకరాలలోపు సీలింగ్ విధించి రైతు భరోసా ఇవ్వాలని కొంతమంది, 10ఎకరాల లోపు ఇవ్వాలని మరికొంత మంది, గుట్టలు, ఎస్ఆర్ఎస్‌పీ భూములకు ఇవ్వొద్దని ఇంకొంత మంది, గత ప్రభుత్వం ఇచ్చినట్లు ఇవ్వాలని, సాగు చేసిన భూ విస్తీర్ణానికే ఇవ్వాలని, 3 ఎకరాలలోపు ఇవ్వాలని, ఐటీ చెల్లించేవారికి, చిన్న రైతులకు ఇవ్వాలని పలువురు అభిప్రాయం వ్యక్తంచేశారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, సహకార శాఖ సూపరింటెండెంట్ సువర్ణ, మానిటరింగ్ అధికారి ముషానిర్ అహ్మద్, ఏవో శ్రీకాంత్, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్ ఆకుల రాజబాపు, కొత్త శ్రీనివాస్, సంఘ కార్యదర్శి మామిడాల అశోక్‌కుమార్, ఏఈవోలు శివకుమార్, మధూకర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

5న మల్లన్న ఆలయంలో వేలంపాట

ఓదెల, జూన్ 29 : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంలో వచ్చేనెల 5న లైసెన్స్ హక్కుల కోసం మధ్యాహ్నం ఒంటిగంటకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈవో సదయ్య తెలిపారు. హోటల్ నడుపుకునే హక్కు కోసం ముందస్తుగా రూ.25వేలు, స్వీట్‌హౌజ్, పూజాసామగ్రి, గాజులు అమ్ముకునే హక్కు కోసం రూ.25వేల చొప్పున ధరావత్తు చెల్లించాలని కోరారు. అలాగే దేవుని ఫొటోలు వంటపాత్రలు రూ.10వేలు, వాహనపార్కింగ్ రూ.లక్ష చెల్లించి సంబంధిత ఈవో కార్యాలయంలో రశీదును పొందాలని కోరారు. అలాగే ఇదే కార్యాలయంలో రూ.500 చెల్లించి టెండర్ దరఖాస్తును పొందాలని జూలై 6 నుంచి 2025 మార్చి 2 వరకు వీటి విక్రయ కాలపరిమితి ఉంటుందని ఈవో తెలిపారు.

సుల్తానాబాద్ రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు



రైస్‌మిల్లుల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

సుల్తానాబాద్, జూన్ 29: సుల్తానాబాద్ ప్రాంతంలోని పలు రైస్‌మిల్లులలో విజిలెన్స్, పౌర సరఫరాల సంస్థ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సుగ్లాంపల్లి పరిధిలోని లక్ష్మీ, సుల్తానాబాద్ పట్టణంలోని సాయితేజ తదితర రైస్‌మిల్లుల్లో మధ్యాహ్నం ప్రాంతంలో అధికారులు బృందాలుగా విడిపోయి మిల్లుల్లో తనిఖీ చేశారు. సీఎంఆర్ కోసం ప్రభుత్వం మిల్లర్లకు అప్పగించిన మేరకు ధాన్యాన్ని మరపట్టి బియ్యం అప్ప గించాల్సి ఉంది. కానీ చాలా మంది మిల్లర్లు తమ కోటాను పూర్తి చేసుకోలేదని, పైపెచ్చు మిల్లుల్లో కూడా ధాన్యం నిలువలు గానీ, బియ్యం నిలువలు గానీ సరిపడా లేవన్న ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి వచ్చిన విజిలెన్స్ అధికారుల బృందం సుల్తానాబాద్‌లో తనిఖీలు నిర్వహించింది. మిల్లుల్లో నిలువలను నమోదు చేసుకున్న అధికారులు మిల్లర్లు చెప్పిన మేరకు సుగ్లాంపల్లి గోదాముల్లో ఉన్న నిల్వల వివరాలను కూడా నమోదు చేసుకున్నారు. గోదాం అధికారులతో మాట్లాడి ఏయే మిల్లర్ల నిలువలు ఎంత మేరకు, ఎప్పటినుంచి ఉన్నాయో తెలుసుకున్నారు. కాగా, సుగ్లాంపల్లిలోని లక్ష్మీ ఇండస్ట్రీస్‌లో తనిఖీ చేయగా 5వేల క్వింటాళ్ళ ధాన్యం నిల్వలు తక్కువగా ఉన్నాయని విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ మిల్లు లో మూడు సీజన్‌లకు సంబంధించి లక్షా 38వేల 370 క్వింటాళ్ల ధాన్యం ఉండాల్సి ఉండగా, లక్షా 32వేల 984 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే నిలువ ఉందని, ఇంకా 5385 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉందని తెలిపారు. అలాగు సాయితేజ మిల్లులో 365 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉందని తెలిపారు.

కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి..

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, జూన్ 29: వర్షాకాల సీజన్ పట్ల మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ అంశాలపై శనివారం క్యాంపు కార్యాలయంలో మేయర్ బంగి అనీల్ కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌పీడీసీఎల్, హెల్త్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో భారీ వర్షాలకు రామగుండం, ఎన్‌టీపీసీ, గోదావరిఖనిప్రాంతాల్లో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, ఈసారి అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధాన నాలాల్లో చెత్తను తొలగించాలని, తద్వారా లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికావన్నారు. ఎన్‌పీడీసీఎల్ అధికారులు విద్యుత్ కోతలు లేకుండా జాగ్రత్తపడాలని, చిన్నవర్షానికే విద్యుత్ సరఫరా నిలిపివేయడం సరైందికాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కొరత లేదని, ఎప్పుడూ నిర్వహణల పేరిట విద్యుత్ నిలిపివేయడం వల్ల ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళతాయన్నారు. సమావేశంలో కమిషనర్ శ్రీకాంత్, ఏసీపీ శ్రీనివాసరావు, ఆర్‌జీ-1 జీఎంచింతల శ్రీనివాస్, ఆర్‌జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, గోదావరిఖని ఏసీపీ మడక రమేష్, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ అధికారులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి కట్టుదిట్టమైన చర్యలు

- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

పెద్దపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కారానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జూన్ 15 నుంచి జూన్ 28వరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ఆర్ఐ పట్టా పాస్ పుస్తకం, కోర్టు కేసు, కోర్టు వివాదంలో ఉన్న పట్టాపాస్ పుస్తకం, డేటా కరెక్షన్, జీపీఏ, ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ, నూతన పట్టా పాస్ పుస్తకాల జారీ/నాలా, ఖాతా మెర్జింగ్, భూసంబంధిత ఫిర్యాదులు, నాలా పీపీబీ, పెండింగ్ మ్యూటేషన్, సక్సెషన్, అర్బన్ ల్యాండ్ మొదలగు అంశాలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత ధరణి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్డేట్ చేసి డిస్పోజ్ చేయాలని అన్నారు. ఆధార్ బయోమెట్రిక్ వేలి ముద్ర స్వీకరణ సంబంధించి ఎల్ 0 పరికరాల వినియోగ గడువు ముగుస్తున్న నేపథ్యంలో జిల్లాలకు ఎల్ 1 బయోమెట్రిక్ పరికరాలు పంపడం జరిగిందని, వీటిని సరిగ్గా రీప్లేస్ చేయాలని అన్నారు.

అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం వారం రోజుల్లో పూర్తి చేసి ఆన్లైన్‌లో పెండింగ్ ధరణి దరఖాస్తులు డిస్పోజ్ చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్కీడ్రా ద్వారా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నంబర్ల కేటాయింపు

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, జూన్ 29: లక్కీడ్రా ద్వారా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నంబర్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. స్థానిక అమర్ చంద్ కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన పెద్దపల్లి పట్టణ డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ రమణారావు అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పాల్గొని లాటరీ పద్ధతిన 466 మంది లబ్ధిదారులకు ఇళ్ల నంబర్లు కేటాయించారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేసి సంవత్సరన్నర కాలం గడిచిందని, తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లబ్ధిదారులకు ఇండ్లు కేటాయింపు చేయాలని ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రస్తుతం పారదర్శకంగా లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు జరుగుతుందని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నివాసయోగ్యంగా మార్చేందుకు విద్యుత్తు, తాగు నీటి సరఫరా డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంక్, మొదలగు మౌళిక వసతులు 605 కోట్లతో నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని, అనంతరం లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లలోకి నివసించడానికి వెళ్లవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో మొదటి దశలో సొంత జాగా ఉన్న వారందరికీ ఇండ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తామని, అనంతరం రెండవ, మూడవ విడతలో జాగా లేని వారికి ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి కావాల్సిన నిధులను సైతం అందిస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు రవాణా, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు గృహ అవసరాలకు ఉచిత విద్యుత్తు పథకాలు అమలు చేశామని, 2 లక్షల రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. రాబోయే వానాకాలం నుంచి సన్నవడ్లకు ఐదు వందల రూపాయల బోనస్ ప్రకటిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని రాంపల్లి, చందపల్లి వద్ద నిర్మించిన 484 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు గతంలో దరఖాస్తులు స్వీకరించి, క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్, రాజ్‌కుమార్, కమిషనర్ ఆకుల వెంకటేష్, ఎస్ఈ బొంకూరి సుదర్శన్, బూతగడ్డ సంపత్, నూగిళ్ళ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మంథని, జూన్ 29: మంథని మున్సిపల్ పరిధిలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తెలియజేస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ రమ-సురేష్ రెడ్డి తెలిపారు. స్థానిక చైతన్యపురి కాలనీలో చిన్న వర్షాలకే రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు జరుగుతున్నాయని, అక్కడి ప్రజలు స్థానిక కౌన్సిలర్ ద్వారా మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురావడంతో శనివారం కమిషనర్‌తో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం సైతం అందించారు. జేసీబీ సహాయంతో రోడ్డుపై నిలిచి ఉన్న నీటిని డ్రైనేజీలకు మరలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్నరోజుల్లో మంథని మున్సిపల్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో అన్ని అభివృద్ధి పనులు పూర్తిచేస్తామని, అందుకోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి మంత్రి ఆమోదం కోసం పంపించామన్నారు. కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు గుండా విజయలక్ష్మి-పాపారావు, కొట్టే పద్మ-రమేష్‌లు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 29: జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డి.శ్రీనివాస్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కొండగట్టులో జనసేనాని





అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్‌కళ్యాణ్

జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్‌కళ్యాణ్‌కు కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అర్చకులు, వేదపండితులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయంలో పలు శాఖల అధికారులతో పాటు నాయకులు పవన్‌తో సెల్ఫీలు దిగారు. - మల్యాల







ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ జనసేనానికి తలపాగా చుడుతున్న అర్చకుడు

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూన్ 29: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. జేష్ఠ బహుళ అష్టమి తోడు కావడంతో లక్ష్మీనరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. భారీగా తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆ లయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటు కున్నారు. రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశా రు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మం త్రోచ్చారణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు ని ర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యా వళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీని యర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

గట్టు సింగారం గుట్టపై అస్థిపంజరం

- రెండు నెలల క్రితం చనిపోయినట్లు నిర్ధారణ

- మగ వ్యక్తి మృతదేహంగా గుర్తింపు

పెద్దపల్లి రూరల్, జూన్ 29: మండలంలోని సబ్బితం గ్రామ పంచాయితి పరిధి గట్టుసింగారం గుట్టపై గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యమైంది. గ్రామానికి చెందిన మేకల కాపరులు మేకలను గట్టుసింగారం గుట్టపైకి మేపడానికి తీసుకెళ్లడంతో గుట్టపైన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి అస్థిపంజరం కనిపించింది. దీంతో సబ్బితం గ్రామపంచాయతీ కార్యదర్శికి రవికి సమాచారం అందించగా కార్యదర్శి బసంత్ నగర్ పోలీసులకు సమాచారం అందించడంతో పాటు ఫిర్యాదు చేశారు. దీంతో బసంత్ నగర్ ఎస్ఐ ఆర్.స్వామి, వైద్యులు సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. పరిశీలించిన వైద్యులు సుమారు 25 నుండి 40 ఏళ్ల వయసు గల మగ వ్యక్తి అస్థిపంజరం అని , అతను చనిపోయి సుమారు రెండు నెలలు సమయం అయిందని పేర్కొన్నారు. సంఘటనపై అక్కడే పంచానామ నిర్వహించి , కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్. స్వామి తెలిపారు.



అస్థిపంజరాన్ని పరిశీలిస్తున్న బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి, వైద్యులు

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

తంగళ్లపల్లి, జూన్ 29: తంగళ్లపల్లి మండ లం పద్మనగర్ గ్రామానికి చెందిన కొట్టాల గోవర్ధన్‌రెడ్డి (29) అనే యువకుడు అనుమా నాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... కొట్టాల లచ్చిరెడ్డి, ప్రమీల దంపతుల రెండో కుమారుడు కొట్టాల గోవర్ధన్‌రెడ్డి శుక్ర వారం రాత్రి రెండో అంతస్తులో ఉన్న బెడ్ రూమ్‌లో నిద్రించడానికి వెళ్లాడు. శనివారం ఉదయం 11 గంటలైనా నిద్రలేవకపోవడంతో తల్లిదండ్రులు వెళ్లి చూడగా బెడ్ పైనుంచి కిందపడి అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



గోవర్ధన్ (ఫైల్)

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూన్ 29: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురు వాహనదా రులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీల లో పట్టుబడిన 28 మంది వాహనదారులను మంగళవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజులు, మరో వ్యక్తికి ఏడు రోజులు, నలుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్ష, మొత్తం 13,500 రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు. మిగతా 22 మంది వాహనదారులకు 36 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

10న జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, జూలై 29: టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాల యంలో 8వ విడత జూనియర్ లైన్‌మన్ సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను జూలై 10న ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తు న్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. పరీక్షలను పారద ర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని తెలిపారు.



అలనాటి కథ

మారిషస్ అనగానే అనేక జ్ఞాపకాలు నన్ను చుట్టుముడతాయి. విశ్వవిఖ్యాతి చెందిన కవి టిఎస్ ఎలియట్‌కు స్వయంగా రాసిన లేఖను బహుమతిగా అందుకోవటం.. ప్రధానులు, రాణులు ఉన్న స్వీట్‌లలో స్టేట్ గెస్ట్‌గా ఉండటం..ఇలా అందమైన గత జ్ఞాపకాలన్నీ గుర్తుకొస్తాయి.

మారిషస్‌లో మరపురాని సంఘటనలు!

తెలుగు లైబ్రరీ శంకుస్థాపన కోసం మారిషస్‌కు వెళ్లిన ఏడాది తర్వాత ఆ దేశ ప్రధాని నన్ను అక్కడ ఉన్న ఒక యూనివర్సిటీలో ప్రసంగించమని ఆహ్వానించారు. ఒక సారి మన దేశం తరఫున వెళ్లే.. మరో సారి ఆ దేశం ఆహ్వానంపై అక్కడికి వెళ్లటం మరచిపోలేని అనుభవమనే చెప్పాలి. నా కోసం ఎయిర్‌పోర్టుకు ప్రధాని సర్ శివసాగర్ రాంగులాం సెక్రటరీ విజయ్ ప్రత్యేకంగా వచ్చి.. నన్ను అక్కడ ఉన్న ప్రముఖ హోటల్ లి రిజ్వీకి తీసుకువెళ్లారు. అక్కడ నేను బస చేసిన స్వీట్‌లోనే ప్రధాని ఇందిరాగాంధీ, బ్రిటన్ రాణి ఎలిజిబెత్ ఉన్నారని అక్కడ స్టాఫ్ చెప్పారు. ప్రపంచంలోనే పెద్ద పెద్ద డిగ్నిటరీలు ఉన్న స్వీట్‌ను నాకు కేటాయించటం చాలా ఆశ్చర్యమనిపించింది. ఆ రోజు రాత్రి మారిషస్ గవర్నర్ జనరల్ విలియం భార్య లేడీ విలియం నా రూమ్‌కు వచ్చి నన్ను రాత్రి డిన్నర్‌కు ఆహ్వానించారు. డిన్నర్ సమయానికి విలియం నేరుగా హోటల్‌కు వచ్చేశారు. ఆ డిన్నర్ చాలా బాగా సాగింది. ఆ మర్నాడు ఉదయం లేడీ విలియం నన్ను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించారు. నేను సున్నితంగా తిరస్కరించాను. మర్నాడు విశ్వవిద్యాలయంలో నా ప్రసంగానికి కూడా మంచి స్పందన లభించింది.



ఈ సందర్భంలో మరో విషయం గురించి చెప్పాలి. మారిషస్‌లో మాల్కం అనే ప్రఖ్యాత రచయిత ఉండేవాడు. అతనిని మారిషస్ ప్రజలు తమ జాతీయ కవిగా భావించేవారు. నేను మారిషస్ వస్తున్నానని తెలిసి ఆయన నా గురించి ఒక వ్యాసం రాశారు. ఎవరి గురించి ఎక్కువగా పొగడని మాల్కం నా గురించి మాట్లాడటం ఒక సంచలనాన్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో- లేడీ విలియం- మార్షల్‌ను కలవాలనుకుంది. నేను కూడా మార్షల్‌కు డిన్నర్ ఇవ్వాలనుకుంటున్నాను కాబట్టి- అందరినీ నా స్వీట్‌కు డిన్నర్‌కు పిలిచాను. ఆ విషయం చెబితే మార్షల్ డిన్నర్‌కు రాడు కాబట్టి- అతనికి లేడీ విలియం వస్తున్నట్లు చెప్పలేదు. నేను పిలిచిన సమయానికి మార్షల్ వచ్చారు. మౌనంగా కూర్చున్నాడు. ఆ తర్వాత లేడీ విలియంను కూడా వచ్చింది. వారిద్దరికీ పరిచయం చేశారు. లేడీ విలియం అనేక విషయాల గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. కానీ మార్షల్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కవులు, కళాకారుల మూడ్స్‌ను ముందుగా గుర్తించటం చాలా కష్టమని మరో సారి నాకు అర్థమయింది.


ఈ పర్యటనలో మరో ఆసక్తికరమైన సంఘటన కూడా జరిగింది. మారిషస్ ప్రధాని కార్యదర్శి విజయ్ నేను ఎక్కడికి వెళ్లినా నాతో పాటే ఉండేవారు. ఒక రోజు హఠాత్తుగా విజయ్‌కు- ఫ్రాన్స్ ప్రధాని మిత్రో మారిషస్‌కు ముందుస్తు సమాచారం ఇవ్వకుండా హఠాత్తుగా వస్తున్నారని.. ఆయనకు వెళ్లి స్వాగతం చెప్పమని ఫోన్ వచ్చింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో విజయ్ నన్ను కూడా ఎయిర్‌పోర్టుకు రమ్మని పిలిచాడు. నేను కూడా అతనితో పాటుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లాను. మిత్రో విమానం ల్యాండ్ అయింది. మిత్రోకు మేము బొకేలు అందించాం. మిత్రోను ప్రసన్నం చేసుకుందుకు విజయ్ రకరకాల విన్యాసాలు చేయటం మొదలుపెట్టాడు. మిత్రో చిన్నప్పుడు రాసిన ఒక కవితను ఇంగ్లీషులో చదివి వినిపించాడు. మిత్రో మొహంలో ఎటువంటి భావాలు కనబడలేదు. "ఇది నా ప్రైవేట్ విజిట్.. ఎటువంటి ప్రొటోకాల్ అవసరం లేదు.. నేను ఒక హోటల్‌లో



ఉంటా" అని విజయ్‌ని కసురుకున్నాడు. ఫ్రాన్స్ ప్రధాని కావాలన్నా.. వద్దన్నా.. ఆయనకు ప్రొటోకాల్ ఇవ్వాల్సిన బాధ్యత మారిషస్ ఉంది. దీంతో విజయ్ - "మీరు ఎక్కడికి వెళ్దాం అక్కడికే వెళ్దాం" అన్నాడు. మేమందరం మిత్రో ముందుగా బుక్ చేసుకున్న ఒక హోటల్‌కు వెళ్లాం. అక్కడ విజయ్‌ను వదిలేసి నేను నా హోటల్‌కు వచ్చేసా! మిత్రో హోటల్‌లో చెకిన్ అయిన తర్వాత 48 గంటల దాకా బయటకే రాలేదట! ఆ తర్వాత బయటకు వచ్చి బీచ్‌లో వ్యాహ్యాళికి వెళ్దామని పిలిచాడట. అక్కడ ఆయన విజయ్‌కు పెట్టిన ఏకైక కండిషన్- "నాకు ఏ ఆహారం పెడతారో.. అదే ఆహారం నా కుక్కకు కూడా పెట్టాలి.. నాకు ఎలాంటి గౌరవం ఇస్తారో.. అలాంటి గౌరవమే నా కుక్కకు ఇవ్వాలి" అని!

ఇలాంటి చిత్రమైన సంఘటనల మధ్య నా మారిషస్ పర్యటన ముగిసింది. నేను భారత్‌కు వచ్చేసే ముందు- ప్రధాని రాంగులాంను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఆ సమయంలో ఆయన నాకు ఒక అమూల్యమైన బహుమతి ఇచ్చారు. అదే విశ్వవిఖ్యాత కవి టిఎస్ ఎలియట్ స్వయంగా రాసిన ఒక లేఖ! దానిని ఆయన ఒక వేలంపాటలో కొన్నారట. "ఇది మీ దగ్గర ఉంటే బావుంటుంది" అని ఆయన బహూకరించారు. అది ఇప్పటికీ నా దగ్గర ఉంది. బహుశా ఇప్పుడు ఆ లేఖ విలువ అంతర్జాతీయ మార్కెట్లో కొన్ని కోట్లు ఉంటుందేమో?

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



తెలుగు సినీ చరిత్రలో వైజయంతి మూవీస్ బ్యానర్‌కు, దాని అధినేత అశ్వనీదత్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 50 ఏళ్ల చలన చిత్ర ప్రస్థానం కలిగిన ఈ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'కల్కి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రికార్డులు సృష్టిస్తోంది. "ఈ బ్యానర్‌లో నా తొలి సినిమాకు అయిన ఖర్చు 15 లక్షలు. కల్కికి అయిన ఖర్చు సుమారు 700 కోట్లు. 500 రెట్లు ఎక్కువ. నన్ను, నా కుటుంబాన్ని, మా బ్యానర్‌ను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలం?" అంటారు అశ్వనీదత్. 'కల్కి' విజయోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో- ఆయన 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

తెలుగు సినిమాగతిని 'కల్కి' మార్చేసింది..!

ప్రపంచవ్యాప్తంగా 'కల్కి' సాధించిన విజయం మీకు ఎలా అనిపిస్తోంది?

దీని కోసమే 50 ఏళ్ల వేచి చూశామేమో అనిపిస్తోంది. మూడేళ్ల క్రితం 'కల్కి' షూటింగ్ ప్రారంభించాం. ఏ విషయంలోను ఎప్పుడూ తొందరపడలేదు. రాజీపడలేదు. 'కల్కి-2'కు సంబంధించి కూడా సుమారు నాలుగు వేల అడుగుల ఫిల్మ్ షూట్ చేశాం. మిగిలింది పూర్తి కావాలి. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం.

సినిమా ప్రపంచంలో జయాపజయాలు ఎప్పుడూ ఉంటాయి.. అపజయాలు ఎదురయినప్పుడు సినిమాల నుంచి విరమిద్దామని ఎప్పుడూ అనుకోలేదా?

ఒక్కసారి కూడా అనుకోలేదు. నాకు 22 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు సినిమా తీస్తానని గ్రేట్ ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లా. అప్పుడు ఆయన- "నువ్వు చదువుకున్నావు. వ్యాపారం చేసుకోవచ్చు కదా! ఇక్కడ ఎప్పుడు ఏమవుతుందో తెలియదు.. నేనే ప్రస్తుతం కొన్ని రోజులు ఖాళీగా ఉంటున్నాను" అన్నారు. కానీ నేను సినిమా తీస్తానని పట్టుపట్టాను. సినిమా తీశాను. ఆ రోజు నుంచి జయాపజయాలు ఎన్నో చూశా. 'శక్తి' లాంటి ఘోర పరాజయాలు కూడా ఉన్నాయి. అలాంటి సమయాల్లో కూడా 'ఇదొక పీడకల. వెళ్లిపోతుంది' అనుకొనేవాణ్ణి.

ప్రథమ కోపం

నేను బయట ఎక్కువగా ఎమోషన్స్ ప్రదర్శించను. అందరూ నా వాళ్లే కదా! బాధపడే అవకాశం ఉంటుంది. అయితే నాకు ప్రథమ కోపం ఎక్కువ. స్వప్నకు కూడా నా పోలికే ఎక్కువ వచ్చింది. తనకి కూడా నాలాగే షార్ట్ టెంపర్. కానీ వెంటనే సర్దుకుంటుంది. ఇక్కడ ఇంకో విషయం చెబుతాను. స్వప్న, ప్రియాంక- ఇద్దరూ ఒకే మాట మీద ఉంటారు. వారి అభిప్రాయాలు వేరుగా ఉండచ్చు. ఆలోచనా విధానం మాత్రం ఒకటే!

మీకు ఇంత ఆత్మనిబ్బరం ఎక్కడి నుంచి వచ్చింది?

మా అమ్మ దగ్గర నుంచి వచ్చింది. నేను సినిమా రంగంలోకి వెళ్లటం మా నాన్నకు ఇష్టం లేదు. నేను అమ్మ దగ్గరకు వెళ్లి చెప్పాను చాలా గొడవ చేశాను ఆ సమయంలో నాకు మా అమ్మ పూర్తిగా మద్దతు ఇచ్చింది. వెన్నంటి నిలిచింది. నాన్నతో పోరాడింది. పట్టుదలగా నన్ను మద్రాసుకు పంపించింది. నా సక్సెస్‌ను తను కళ్లారా చూసింది. అందుకే మా అమ్మకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

ఇంత పెద్ద బడ్జెట్‌తో 'కల్కి' ఎలా తీయగలిగారు?

'కల్కి'లాంటి సినిమాను తీయగలగటం కారణం- మా అమ్మాయిలు- స్వప్న, ప్రియాంక. వాళ్లిద్దరు అమెరికాలో చదువుకొని వచ్చారు. ఆ సమయంలో వాళ్లతో ఏదైనా ఒక పరిశ్రమ పెట్టించాలనుకున్నా. కానీ వాళ్లు సినిమా రంగంలోకి రావాలనుకున్నారు. స్వప్న ముందు చిన్న వీడియో చిత్రాలు తీసేది. ప్రియాంక వచ్చిన తర్వాత- ఇద్దరూ ప్రొడక్షన్‌లోకి వచ్చారు. ఆ సమయంలో వాళ్లకు కొన్ని ఫెయిల్యూర్స్ వచ్చాయి. వాళ్లు వాటిని తట్టుకొని నిలబడగలిగారు. ఆ తర్వాత మానసికంగా, శారీరకంగా చాలా కష్టపడి 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా తీశారు. అదొక టర్నింగ్ పాయింట్.

'ఎవడే సుబ్రమణ్యం' - ఒక భిన్నమైన సినిమా. దాని కథ చెప్పినప్పుడు మీరేమన్నారు?

నాకు వాళ్ల మీద నమ్మకం ఉండేది. కానీ అదొక భిన్నమైన సినిమా. ఆ కథ చెప్పినప్పుడు- "కథ డిఫరెంట్‌గా ఉంది. బావుంది.. తీయండి.. అనుభవం వస్తుంది కదా..." అన్నాను. కానీ ఆ సినిమా తీస్తే రిస్క్ ఉంటుందనే విషయం నాకు తెలుసు. వాళ్లకు అనుభవం వస్తే చాలనుకున్నాను. కానీ ఆ సినిమా చాలా పెద్ద సక్సెస్ అయింది. ఆ తర్వాత వాళ్లు చాలా నేర్చుకున్నారు. ఆ సినిమా తర్వాత 'మహానటి' తీశారు. ఆ సమయంలో నాకు చాలా ఆనందం కలిగింది. ఎందుకంటే సావిత్రి గారు నాకు బాగా తెలుసు. అలాంటి గొప్ప నటి మీద చిత్రం తీయటం అంత సులభం కాదు. 'నేను ఇలాంటి స్టోరీ చేయలేకపోయాను. పిల్లలు చేస్తున్నారు' అనుకొనేవాణ్ణి.. బడ్జెట్ ఎక్కువయింది. పట్టించుకోవద్దని వాళ్లకు ధైర్యం చెప్పా. ఆ సినిమా కాపీ చూసిన తర్వాత మతి పోయింది. అంత గొప్పగా ఉందా సినిమా! ఆ తర్వాత 'జాతి రత్నాలు' పెద్ద హిట్. ఇలా వాళ్లకు సక్సెస్ అనేది ఒక్క రోజులో రాలేదు. ఒకో మెట్టు ఎక్కుతూ వచ్చారు. ఇప్పుడు శిఖరాన నిలబడ్డారు.

మీ సమయానికి, ఇప్పటికీ సినిమా నిర్మాణంలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

మా రోజుల్లో హీరో ఇమేజ్ ఆధారంగా కథలను రూపొందించుకొనేవాళ్లం. హీరోలకు చెబితే వెంటనే ఒప్పుకొనేవారు. ప్రస్తుతం ఉన్నన్ని డిస్కషన్స్ ఉండేవి కావు. ప్రస్తుతం సినిమా నిర్మాణ ప్రక్రియ చాలా స్లో అయింది. అన్నీ జాగ్రత్తగా చూసుకొన్న తర్వాత మొదలుపెడుతున్నారు. అవుట్‌పుట్ కూడా అంత గొప్పగానూ వస్తోంది.



మీరు అనేక మంది హీరోలతో సినిమాలు తీసారు కదా.. వారిలో ఉన్న గొప్ప గుణాలేమిటి?

నా సినీ జీవితంలో బెస్ట్ టైమ్ చిరంజీవిగారి ఎంట్రీ తర్వాతే వచ్చిందని చెప్పాలి. 'జగదేకవీరుడు-అతిలోక సుందరి'తో ఆయనతో ప్రారంభమయిన ప్రస్థానం మరో మూడు సినిమాల వరకూ సాగింది. ఎక్కడా చిన్న పొరపొచ్చాలు కూడా రాలేదు. మహానుభావుడని చెప్పాలి. ఆ తర్వాత నాగార్జునగారితో ఐదు సినిమాలు చేశాను. చాలా మంచి మనిషి. ఇక కృష్ణగారి గురించి చెప్పక్కర లేదు. గొప్ప వ్యక్తి. 'అగ్నిపర్వతం' సినిమా తీస్తున్నప్పుడు ఆయన అనేక సూచనలు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభాస్‌తో చేశా! తనకు కథ చెప్పినప్పుడు - "ఇది నా కోసం రాసిన కథ. నేను చేసి తీరతాను" అని మూడేళ్లు అన్నీ పక్కన పెట్టి సినిమాలో నటించాడు. విపరీతమైన సహకారం అందించాడు. మూడేళ్ల పాటు అతనికి ఈ సినిమా తప్ప వేరే ఆలోచనే లేదు. నేను చేసిన హీరోలందరూ నిర్మాత చల్లగా ఉండాలను కొనేవారే! మంచి సహకారం అందించిన వారే!

మీరు అనేక మంది దర్శకులతో పనిచేశారు. ఏ దర్శకుడితో నాగిని పోలుస్తారు?

నాగిపై ఏ దర్శకుడి ప్రభావం ఉన్నట్లు కానీ, పోల్చగలిగినట్లు కానీ నాకు అనిపించలేదు. తను ఏది అనుకున్నాడో అదే తీశాడు. ఎక్కడా ఎక్కువా లేదు, తక్కువా లేదు. ఒక సీను చూసి- 'దీన్ని ఇంకా బాగా తీయవచ్చు' అని నాకు ఎక్కడా అనిపించలేదు. గ్రాఫిక్స్ విషయంలో తను పడిన శ్రమ అసామాన్యం. తనకు ఇసుమంత గర్వం కూడా లేదు. 'మహానటి' సినిమాలో తన విశ్వరూపం చూపించాడు. అప్పుడు 'భగవంతుడు నాకు అలాంటి అల్లుణ్ణి ఇచ్చాడు చాలు...ఎంత కాలమైనా సినిమాలు తీస్తానే ఉంటా' అనుకున్నా. ఇప్పుడు 'కల్కి'తో తెలుగు సినిమాను వేరే స్థాయికి తీసుకువెళ్లాడు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

సమయం గడిచిపోయింది..

నా ఉద్దేశంలో తెలుగు సినిమా గతిని 'కల్కి' మార్చేసింది. మన దేశంలో వచ్చిన గ్రేటెస్ట్ ఫిల్మ్‌లో ఇది కూడా ఒకటి. ఇలాంటి సినిమా తీస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. గత మూడేళ్లు ఆడుతూ పాడుతూనే సెట్స్‌కు వెళ్లేవాడిని. 'వాళ్లు ఒక మహాయజ్ఞం చేస్తున్నారు. దానికి సమిధలు సమకూర్చటమే నేను చేయాల్సింది' అనుకున్నా! ఆ యజ్ఞ ఫలితం చూస్తుంటే విపరీతమైన ఆనందం కలుగుతోంది. పిల్లలను చూస్తుంటే- సినిమా తీసే విధానం నాకు కూడా తెలియదేమోననిపిస్తోంది. అమితాబ్, దీపిక, కమల్‌హాసన్, ప్రభాస్.. ఇలా దేశంలోనే అతి పెద్ద స్టార్స్ అందరినీ తీసుకువచ్చి సినిమా తీయటం అంత సులభం కాదు.

ఎన్టీఆర్ పెట్టిన పేరు!




సినిమా తీయటానికి వెళ్లినప్పుడు- ఎన్టీఆర్- "బ్యానర్‌కు ఏం పేరు పెట్టావు?" అని అడిగారు. "మీరు ఏ పేరు చెబితే ఆ పేరు పెడతా.." అన్నా. ఆయన అక్కడ ఉన్న కృష్ణుడి పటం వైపు చూశారు. "కృష్ణుడు మనకు అచ్చొచ్చిన దైవం కదా... 'వైజయంతి మూవీస్' అని పెట్టు.." అని ఒక కాగితంపై రాసి ఇచ్చారు. అలా ఆ మహానుభావుడితో పేరు పెట్టించుకొనే అదృష్టం దక్కింది.

ఎలా గుర్తుండాలంటే...



తెలుగు సమాజాన్ని, ప్రజలను అర్థం చేసుకొని... వాళ్ల అభిరుచులను గమనిస్తూ.. వాళ్ల అంచనాలకు మించిన గొప్ప సినిమాలు తీసే నిర్మాతగా నన్ను చరిత్ర గుర్తుపెట్టు కోవాలనుకుంటున్నా!

కల్కి- పార్ట్ 2



'కల్కి'ని మొదట రెండు భాగాలుగా తీద్దామని అనుకోలేదు. షూటింగ్ కొంత అయిన తర్వాత అనుకున్నారు. "కమల్‌హాసన్ క్యారెక్టర్ రెండో పార్ట్‌లోనే ఎలివేట్ అవుతుంది. దాని మీద ఎక్కువ వర్క్ చేద్దామనుకుంటున్నా" అని నాగీ చెప్పాడు. 'కల్కి' మొదటి పార్ట్ సూపర్ హిట్ అయింది. రెండోది కూడా మొదటి పార్ట్ కన్నా ఎక్కువ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. అమితాబ్, ప్రభాస్, కమల్ ముగ్గురు కలిసే సీన్స్ చాలా గొప్పగా ఉంటాయనిపిస్తుంది.

ఈ ముంబై భామ టీవీ నటిగా పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత వెండితెరకొచ్చింది. పేరు నుస్రత్ భరూచా. 'రామ్‌సేతు', 'ఛత్రపతి' లాంటి హిందీ చిత్రాలతో పాపులరైన నుస్రుత్ భరూచా గురించి కొన్ని విశేషాలు...

అందుకే... కెరీర్‌లో నిలబడాలనుకున్నా..!

నుస్రత్ భరూచాకు ఇన్‌స్టాలో ఏడు మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. తన ఇంట్లో ఫొటోలు, పెంపుడు జంతువులు, తినే ఆహారం, యాత్రా విశేషాలు, సినిమా కబుర్లు చెబుతుంటుంది. ఫొటోషూట్స్ అప్‌లోడ్ చేస్తుంటుంది. బాలీవుడ్ కథానాయికగా మరీ అంత పెద్ద హిట్లు లేకపోయినా.. ఆమెకు ఇన్‌స్టాలో మంచి ఫ్యాన్‌బేస్ ఉంది.

ఇంట్లో తెలీకుండా..

తన్వీర్, తస్నీమ్ దంపతులకు పుట్టిన గారాల పట్టి నుస్రత్. ముంబైలోనే పుట్టి పెరిగింది. అక్కడే విద్యాభ్యాసం. డిగ్రీ వరకు చదివింది. ఆ మధ్యలోనే సినిమా పిచ్చి పట్టుకుంది. సినిమాల్లోకి వెళ్తానంటే.. కుదరదన్నారు ఇంట్లో. దీంతో చేసేదేమీ లేక కొన్నాళ్లు ఊరుకుంది. ఆ తర్వాత ఇంటి దగ్గరనుంచి ఏదో కోర్సు చదవాలని వెళ్లి.. ఆడిషన్స్‌కు అటెండ్ అయ్యేది. అలా 'కిట్టీ పార్టీ' సీరియల్‌లో ఎంపికయింది. ఇంట్లో వాళ్లకు తెలీకుండా షూటింగ్‌లో పాల్గొంది. చివరికి ఇంట్లో వాళ్లు వొప్పుకోలేదు. ఇదో కెరీర్ అని వొప్పించింది. 2016లో 'జై సంతోషిమా' అనే చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైంది.

అంత సులువుగా సక్సెస్ కాలేదు..

నుస్రత్ అందం, అభినయం ఉన్నా ప్రతిభ మాత్రం తప్పదని గ్రహించింది. సీరియల్స్‌లో నటించిన అనుభవంతో సినిమాల్లో నటించింది. ఒక్క సినిమా కూడా వర్కవుట్ కాలేదు. హీరో శివాజీ సరసన 'తాజ్ మహల్'(2010)లో నటించింది. ఓ తమిళ చిత్రంలో నటించింది. అయినా ఆమెకు అపజయాలే పలకరించాయి. 'ఎల్.ఎస్.డీ' చిత్రంతో నోటెడ్ అయ్యింది. అలాంటి సమయంలో 2011లో 'ప్యార్ కా పంచనామా' చిత్రంతో ఆమెకు సక్సెస్ దక్కింది. 'ఆకాష్‌వాణి', 'ప్యార్ కా పంచనామా 2', 'డ్రీమ్ గాళ్', 'రామసేతు'.. లాంటి బాలీవుడ్ చిత్రాల్లోని ఆమె నటనకు చక్కటి గుర్తింపు వచ్చింది. గతేడాది 'ఛత్రపతి' హిందీ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ జోడీగా నటించింది. వాస్తవానికి ఇది ప్రభాస్ 'ఛత్రపతి'కి రీమేక్. ఈ సినిమాతో ఆమెకు క్రేజ్ వరించింది.



నేను నటించిన సినిమాను పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు.. బాగా గుర్తుంది! నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకో వాలనుకున్నా

మ్యూజిక్ వీడియోలతోనూ పాపులర్..

'చలాంగ్' చిత్రంలో రాజ్‌కుమార్. ఆర్ తో కలసి నటించింది. ఇందులో 'కేర్ కి నర్దా..' అనే ఓ పాట యూట్యూబ్‌లో రిలీజ్ అయినప్పుడు.. ముప్పయి కోట్లకు పైగా వీక్షించారు. యోయో హనీసింగ్‌తో చేసిన 'సయాన్ జీ..' పాటను యాభై కోట్లకు పైగా వీక్షించారు. దీంతో నుస్రత్‌కు యూత్‌లో మంచి ఆదరణ దక్కింది. 'ఆజీబ్ దాస్తా', 'తు జూతీ మే మక్కర్' లతో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో కూడా ఆమె ఫేమ్ అయ్యింది. 'ఒకప్పుడు ఆడిషన్‌కు వెళితే.. సరిపోవు ఈ పాత్రకు అనేవాళ్లు. అవేమీ పట్టించుకోలేదు. సినిమాల్లో నటించటం మొదలెట్టాక.. ఓ చిత్రం పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా.
ఆ రోజు నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవటమే కాదు కెరీర్‌లో నిలబడాలి అనుకున్నా' అంటుంది నుస్రత్. రెండేళ్ల కిత్రం వెర్టిగో సమస్యతో బాధపడింది. డ్యాన్స్ వేసేప్పుడు కిందపడి మోకాలి, వెన్ను సమస్య వచ్చింది. మానసికంగా బలాన్ని పుంజుకుంది. మళ్లీ మామూలు స్థితికి రావటానికి ఏడాది సమయం పట్టింది. ఆ సమయంలో జీవితం అంటే ఏంటో అర్థమైంది అంటుంది నుస్రత్ భరూచా.

పాదాల పగుళ్లు పోవాలంటే...

ఈ వానా కాలంలో కొందరికి, పాదాలు, మడమలు పగిలి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఎక్కువగా పగిలితే ఆ పగుళ్ల నుండి రక్త స్రావం అయే అవకాశం కూడా ఉంటుంది. వర్షరుతువులో పాదాలు కొంచెం ఎక్కువ సేపు నీటిలో నానినా పగుళ్లబాధ తీవ్రం అవుతుంది.ఈ పగుళ్ల నివారణకు ఇంట్లోనే పాటించగల చిట్కాలను తెలుసుకుందాం,



బేకింగ్‌సోడాతో: ఒక బకెట్ లేదా టబ్‌లో గోరువెచ్చని నీరు తీసుకుని, అందులో మూడు స్పూన్ల బేకింగ్ సోడాకలిపి, ఆ నీటిలో పదిహేను నిమిషాల పాటు పాదాలను ఉంచి, తరువాత పొడి బట్టతో పాదాలను తుడిచి ప్యుమిస్ స్టోన్‌తో మృతచర్మ కణాలు తొలగిపోయేలా రుద్ది... తరువాత కొబ్బరినూనెలో అలోవెరా జెల్ కలిపి రాయాలి.

బియ్యపుపిండితో: చర్మం మీది మృతకణాలు తొలగించడంలో బియ్యపుపిండి అద్భుతంగా పని చేస్తుంది. ఒక టేబుల్ స్పూన్ తేనెలో మూడు టేబుల్‌స్పూన్ల బియ్యపు పిండిని కలిపి, దానికి నాలుగు చుక్కల వెనిగర్ ను చేర్చి, ఆ మిశ్రమంతో పాదాలను పది నిమిషాల పాటు సున్నితంగా మర్దన చేయాలి. దీనివల్ల మృతకణాలు తొలగిపోవడంతో పాటు, తేనె వల్ల చర్మం తేమగా మారుతుంది.

నిమ్మరసంతో: ఐదు స్పూన్ల సముద్రపు ఉప్పుకు ఒక స్పూను కొబ్బరినూనె ఒక చెంచా నిమ్మరసం కలిపిపాదాలకు రాసి, పదిహేను నిమిషాలు ఉంచి చల్లని నీటితో కడిగేయాలి.

యాపిల్ సిడర్ వెనిగర్‌తో: ఒక చెంచా తేనె, ఒక చెంచా బియ్యపు పిండికి, ఒక చెంచా యాపిల్ సిడర్ వెనిగర్ చేర్చి ఈ మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి తరువాత గోరువెచ్చని నీటిలో కడిగేయాలి.

నువ్వుల నూనెతో: నువ్వుల నూనె, కొంత గ్లిజరిన్.. రెండు చెంచాల కాఫీ పొడిని చేర్చి, ఆ మిశ్రమంతో కూడా పాదాలకు మర్దన చేసి, గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

ఓట్‌మీల్‌తో: ఓట్‌మీల్, ఆలివ్ నూనె తేనె బియ్యపుపిండి కలిపిన మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

సంక్షిప్త సమాచారం

● పెద్దపల్లిటౌన్, జూన్ 29: పట్టణంలోని 8వ వార్డులో నెలకొన్న సమస్యలపై పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మిసురేందర్‌సన్నీ శనివారం వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.40లక్షలు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి వార్డు సమస్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్‌మస్రత్, యండి మసూద్ పాల్గొన్నారు.

● ధర్మారం : ధర్మారం మండల సర్వసభ్య సమావేశం వచ్చే నెల 2న మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని వివరించారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

● కోల్‌సిటీ : విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో బర్రె మృతిచెందిన సంఘటన గోదావరిఖని జనగామాలో జరిగింది. గోదావరి రోడ్డుకు వెళ్లే పొలాల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు శనివారం బర్రెకు విద్యుత్‌షాక్ రావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. రుద్రభట్ల ప్రవీణ్‌కు చెందిన ఈ బర్రె విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు.

● కోల్‌సిటీ : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ పదవీవిరమణ పొందుతున్న త్రియంబకేశ్వర్‌రావు దంపతులను శనివారం నగర మేయర్ బంగి అనిల్ కుమార్, కమిషనర్ శ్రీకాంత్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది సత్కరించారు. అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, ఎస్‌ఈ చిన్నారావు, ఈఈ సుచరణ్, రామన్, సూపరింటెండెంట్ మనోహర్, కార్పొరేటర్లు శంకర్ నాయక్, బాలరాజ్‌కుమార్, కృష్ణవేణి పాల్గొన్నారు.

● పెద్దపల్లి (ఆంధ్రజ్యోతి): గౌడుల సంక్షేమం కోసం త్వరలోనే పెద్దపల్లి జిల్లాలో ట్రస్టు ఏర్పాటుకు కృషి చేస్తానని మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ సీఐ చిప్ప రాజమౌళి గౌడ్ అన్నారు. పెద్దపల్లిలోని ఆర్‌కె గార్డెన్‌లో జరిగిన తన పదవీ విరమణ సభలో మాట్లాడారు. మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తూ ఈనెల 30న పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా రాజమౌళిగౌడ్‌ను సన్మానించారు. కాల్వశ్రీరాంపూర్ ఎంపీపీ గోపాగోని సారయ్యగౌడ్, గోపా జిల్లా అధ్యక్షుడు బాలసాని వెంకటేశం, రామగిరి ఎంపీపీ అరెల్లి దేవక్కకొమురయ్య పాల్గొన్నారు.

● ధర్మారం : అన్ని వృత్తుల్లో కన్నా ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అన్నారు. శనివారం మండలంలోని కటికెనపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు మిర్యాల రాజిరెడ్డి పదవీవిరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మానకార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. రాజిరెడ్డిని ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు ఏ.మల్లేశం, డీఆర్‌డీవో పీడీ శ్రీధర్, ధర్మారం,జూలపల్లి ఎంఈవోలు ఛాయాదేవి, కవిత, అమ్మ దర్శ కమిటీ చైర్‌పర్సన్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

● కోల్‌సిటీ : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన భాస్కర్ శనివారం సీపీ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులను సమన్వయపరుస్తూ ప్రజలతో సత్సంబంధాలను కలిగి ఉండాలన్నారు.

● ఓదెల : మండలంలోని పొత్కపల్లి నుంచి కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం సీఆర్ఎఫ్ గ్రాంట్ నిధులు రూ. 25 కోట్లు మంజూరు చేయడంపై శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావు చిత్రపటానికి శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే రైతులకు రుణమాఫీ ప్రకటించినందుకు కొమిరలో సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు.

● కోల్‌సిటీ : విధుల్లో క్రమశిక్షణ రాహిత్యంగా వ్యవహరించిన రామగుండం కమిషనరేట్ పరిధిలోని రామగిరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సీహెచ్ సదానందంను సస్పెండ్ చేస్తూ శనివారం సీపీ శ్రీనివాస్ ఆదేశాలు జారీచేశారు. పోలీస్‌శాఖ ప్రతిష్టకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

●ఓదెల : రైతు భరోసా పథకం అమలు కోసం పొత్కపల్లిలో శనివారం వ్యవసాయ అధికారులు సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు.

నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

సుల్తానాబాద్, జూన్ 29: దేశాన్ని కుదుపేసిన నీట్ సమస్యకు పరిష్కారం లభించాలని, విద్యార్థులకు న్యాయం జరగాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఎంపీగా ఆయన గెలుపొందిన అనంతరం మొదటి సారిగా సుల్తానాబాద్‌కు రాగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు ఎంపీకి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలు పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీ తన తాతా కాక వెంకటస్వామి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ విలేకరులతో మాట్లాడుతు అత్యున్నతమైన నీట్ పరీక్షల్లో విద్యార్థులకు అన్యాయం జరిగిందని, ఈ విషయంలో వారికి న్యాయం జరగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి ప్రాంత అభివృద్ధికి కేంద్ర మంత్రిగా, ఎంపీగా వెంకటస్వామి కృషి చేశారని, అలాగే వివేక్ కూడా ఐదేళ్ల పని చేశారని ప్రస్తుతం కాక మనవడు వంశీకృష్ణ కూడా వారిని ఆదర్శంగా తీసుకుని పెద్దపల్లి అభివృద్ధికి పెద్దపీట వేస్తారన్నారు.



సుల్తానాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం..

గోదావరిఖని, జూన్ 29: పెద్దపల్లి ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, కేంద్రం నుంచి రావాల్సి నిధులతో పాటు నియోజకవర్గంలో కావాల్సిన పనుల విషయంలో తప్పకుండా నిరంతర పోరాటం చేస్తానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. ఎంపీగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా నియోజకవర్గానికి చెందిన ఆయనకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గోదావరిఖనిలో ఘన స్వాగతం పలికారు. దివంగత వెంకటస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాగతం పలికిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రామగుండంలో జెన్‌కో ద్వారానే పవర్ ప్లాంట్ నిర్మించాలి

అంతర్గాం, జూన్ 29: రామగుండం పట్టణంలోని బీ థర్మల్ విద్యుత్ కేంద్రం మూసివేత దశకు చేరుకున్న నేపథ్యంలో జెన్‌కో ద్వారానే 800 మెగవాట్ల పవర్‌ప్లాంట్ నిర్మించాలని బీఆర్ఎస్ నాయకుడు, కార్మిక నేత కౌశిక హరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రామగుండం పట్టణంలోని తన నివాసంలో ప్రెస్‌మీట్ నిర్వహించి కౌశిక హరి మాట్లాడారు. గోదావరిఖనిలో గనులు మూసివేత జరుగుతున్న క్రమంలో అక్కడ ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి గోదావరిఖనిలో సింగరేణి ద్వారా, రామగుండంలో జెన్‌కో ద్వారా పవర్ ప్లాంట్లు నిర్మించి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు.గతంలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో తాను 600/2 మెగావాట్ల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి కృషి చేస్తే నాయకుల నిర్లక్ష్యం కారణంగా అవి ఇతర ప్రాంతాలకు తరలిపోయాయన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కౌశికలత, ముదాం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తిరుపతినాయక్, కుక్క గంగాప్రసాద్, శివరాత్రి గంగాధర్, మద్దికుంట శంకర్, దారంగుల కుమార్, ముస్తాఫా పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారు

- బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంత కుమార్

గోదావరిఖని, జూన్ 29: ఉచితాల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారని, బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంత కుమార్ అన్నారు. శనివారం గోదావరిఖని జీఎం కాలనీలోని సంజీవని ఆంజనేయస్వామి ఆలయంలో బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్‌తో కలిసి మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు ఇస్తామని హామీ ఇచ్చినా అవి నెరవేరలేదని, అమలుకాని హామీలు ఇస్తూ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మరన్నారు. ఆర్థిక క్రమశిక్షణ ప్రతి రాష్ట్రానికి, దేశానికి అవసరమన్నారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీని భవిష్యత్‌లో ప్రజలు విశ్వసించరని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీజేపీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి ఆదరణ పెరుగుతుందని, మూడవ సారి బీజేపీకి పట్టం కట్టినందుకు దేశ ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, కందుల సంధ్యారాణి, కాసిపేట శివాజీ, క్యాతం వెంకటరమణ, గుండబోయిన భూమయ్య, విశ్వనాథ్, ఉపేందర్, శ్రీనాథ్, సురేష్ పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు చట్ట ప్రకారం నష్టపరిహారం

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిటౌన్, జూన్ 29: వరంగల్-మంచిర్యాల మధ్య నాలుగు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు, ఆస్తులు కోల్పోతున్న నిర్వాసితులకు చట్టప్రకారం పరిహారం చెల్లిస్తున్నామని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ తెలిపారు. శనివారం అదనపు కలెక్టర్ కలెక్టరేట్‌లో మంచిర్యాల-వరంగల్ జాతీయ రహదారి భూ నిర్వాసితులతో సమావేశమై వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్- మంచిర్యాల మధ్య 4లైన్ల గ్రీన్ ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు చట్టప్రకారం వీలైనంత మేరకు అధికంగా నష్టపరిహారం వచ్చే విధంగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణ అలైన్మెంట్‌ను కేంద్రం పరిధిలోని సంస్థ నిర్ణయిస్తుందని, అలైన్మెంట్ మార్పు తమకు సంబంధం ఉండదని తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణం వల్ల తాము నష్టపోతున్నట్లు అందించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారించి చట్టప్రకారం పరిహారం అందజేస్తామని తెలిపారు. భూములకు చట్ట ప్రకారం రేటు చెల్లించడంతో పాటు, ఆ భూములలో ఉన్న బోర్లు, బావులు, చెట్లు, మోటార్లు, ఇండ్లు, పైప్‌లైన్ మొదలగు ఆస్తులకు విలువ కట్టి నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి హనుమా నాయక్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, భూ నిర్వాసితులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

పెద్దపల్లిటౌన్, జూన్ 29: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వర్షాకాలం దృష్ట్యా రైతులకు అలాగే గృహ వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా శనివారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని ప్రజలకు విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ ఎస్‌ఈ బోంకూరి సుదర్శన్, డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలి

ఎలిగేడు, జూన్ 29 : చట్టాలపై ప్రజలందరికీ అవగాహన కలిగి ఉండాలని తాహసీల్దార్ స్వర్ణ అన్నారు. మండలంలోని బురహాన్‌మియాపేట్‌లో శనివారం సివిల్ రైట్స్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆర్ఐ జయ, మాజీ సర్పంచ్ ఆర్‌కె.రాజా, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, ఏఎస్సై, అంబేద్కర్ సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జూన్ 29 : గ్రామాల్లో ఎక్కడా ఎలాంటి తారతమ్యాలు ఉండకూడదని, కుల వివక్షలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ తిరుపతి అన్నారు. శనివారం మండలంలోని రాగినేడు గ్రామంలోని దళిత కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ తహసీల్దార్ తిరుపతి హజరై మాట్లాడారు. మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ రాంమ్మోహన్, గ్రామ ప్రత్యేకాధికారి కమలాకర్, రెవెన్యూ అధికారులు రాజు, పంచాయతీ కార్యదర్శి శ్యాం సుందర్,ఎస్సీ వెల్ఫేర్ అధికారి లావణ్యతో పాటు మామిడిపల్లి బాపన్న పాల్గొన్నారు.

ఓదెల : మండల కేంద్రంలోని దళిత కాలనీలో శనివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో కుల వివక్ష నివారణ పౌరహక్కుల సమావేశాన్ని నిర్వహించారు. దళితులతో మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా కుల వివక్షత ఉందా అనే అంశాలపై తహసీల్దార్ యాకయ్య ఆరాతీశారు. ఎంపీడీవో తిరుపతి, ఏఎస్ఐ సుధాకర్, ఎంపీవో భాస్కర్, పంచాయితీ కార్యదర్శి, దళిత సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలం కునారంలో తహసీల్దార్ జాహిద్ పాషా ఆధ్వర్యంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, తహసిల్దార్ ఎండీ జాహెద్ పాషా, ఎంపీడీఓ రామ్మోహన చారిలు పాల్గొని ఎస్సీ కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ బీ ఓంకార్ యాదవ్, ఏవో నాగార్జున,ఎంపీటీసీ కొల్లూరి రమాదేవిరాజమల్లు, మాజీ సర్పంచ్ డొంకెన విజయమొగిలి తదితరులు పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి'

కోల్‌సిటీ, జూన్ 29: రామగుండం కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు మరువలేనివని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. శనివారం తెల్లవారుజామున గోదావరిఖని చౌరస్తాలో పారిశుధ్య కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల కృషి అభినందనీయమన్నారు. త్వరలోనే కార్మికుల సమస్యల పరి ష్కారం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

కళ్యాణ్‌నగర్, జూన్ 29: రామగుండం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పీ మల్లికార్జున్, ప్రధానకార్యదర్శిగా ఎల్లప్ప, కోశాధికారిగా గోవర్ధన్‌రెడ్డిలు శుక్రవారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, మేయర్ బంగి అనిల్ కుమార్, కోదండరాం, మినేష్ నారాయణ్, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, తానిపర్తి విజయలక్ష్మి, సోమారపు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి

పెద్దపల్లి రూరల్, జూన్ 29: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి అన్నారు. శనివారం మండలంలోని అప్పన్నపేట జడ్పీ పాఠశాలలో సైబర్ నేరాలపై బసంత్‌నగర్ పోలీస్ ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్‌లను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్ఐ స్వామి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఏవరైనా సైబర్ నేరాల వల్ల మోసపోతే టోల్ ఫ్రీ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ సేవలో లయన్స్‌క్లబ్ ముందుంటుంది

సుల్తానాబాద్, జూన్ 29: సామాజిక సేవలో లయన్స్‌క్లబ్ ముందుంటుందని క్లబ్ పూర్వ గవర్నర్ చిదుర సురేష్ అన్నారు. సుల్తానాబాద్ లయన్స్‌క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం శనివారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షునిగా మాటేటి సంజీవ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం జరిగిన ప్రతిష్ఠాపన ఉత్సవంలో నూతన కార్యవర్గం చే ప్రమాణ స్వీకారం చేయించారు. పూర్వ గవర్నర్ సురేష్, క్లబ్ అధ్యక్షుడు సంజీవ్, రీజియన్ చైర్మన్ వెంకట్, జోన్ చైర్మన్ వేముల విష్ణుమూర్తి, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్లు వలస నీలయ్య, మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్, రాంబాబు, సుధాకర్ ఈసీ మెంబర్లుగా గజబీంకార్ శ్రీనివాస్, నవీన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి కృషి విజ్ఞాన కేంద్రానికి అవార్డు



అవార్డును అందుకుంటున్న కేవీకే ప్రిన్సిపాల్

రామగిరి, జూన్ 29: కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక జోనల్ వర్క్‌షాప్‌లో రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం అవార్డును కైవసం చేసుకుంది. ఈనెల 25, 27వ తేదిలలో ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోని రాజమండ్రిలో జాతీయ పొగాకు పరిశోధన సంస్థలో నిర్వహించిన కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక జోనల్ వర్క్‌షాప్‌లో శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం 2024-25 సంవత్సరానికి గాను అవార్డు అందుకుంది. వర్క్‌షాప్ జోన్-10లో 72 కృషి విజ్ఞాన కేంద్రాలు పాల్గొనగా అందులో విస్తరణ కార్యక్రమాల్లో రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం మొదటి స్థానంలో నిలిచి అవార్డును అందుకుంది. దీంతో పాటు మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఇన్ హార్టికల్చర్ కార్యక్రమాన్ని రైతుల్లోకి తీసుకెళ్లి రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేసిన విభాగంలో సైతం అవార్డును అందుకున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, ఎంఎం హెడ్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

పెద్దయ్య దేవుడి పట్నాలు

పాలకుర్తి, జూన్ 29: మండలం పరిధిలోని జయ్యారం గ్రామ శివారులోని అంకమెట్టు గుట్టకు వెలసిన పెద్దయ్య దేవుని పట్నాలలో భాగంగా మొదటి రోజు శనివారం విగ్రహ మూర్తులకు ఆలయ పూజారులు గంగానదిలో ప్రత్యేక స్నానం చేయించి గ్రామంలో జోగు ఎత్తారు. ఆదివారం జరిగే పట్నాల కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ దంపతులతో పాటు సమీప గ్రామాల ప్రజలు ప్రత్యేక మొక్కులు చెల్లించుకోనున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

'వారధి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రిన్సిపాల్'

కళ్యాణ్‌నగర్, జూన్ 29: వారధి ద్వారా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉద్యోగం పొందిన 31మంది ఉద్యోగులను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వేధింపులకు గురి చేస్తుందని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ ఆరోపించారు. వారధి సొసైటీ ద్వారా ఉద్యోగాలు పొందిన 31మందికి పొడిగింపు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మూడు నెలలుగా వేతనాలు రాక వారు అవస్థలు పడుతున్నారన్నారు. వారధి ద్వారా రెండు సంవత్సరాల క్రితం ఉద్యోగం పొందిన వారిని తొలగించేందుకు ప్రిన్సిపాల్ కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. తనకు నచ్చిన వారికి ఉద్యోగాలను అమ్ముకోవడానికి ప్రిన్సిపాల్ ప్రయత్నిస్తుందని, దీనిపై జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చర్యలు చేపట్టాలని కోరారు. ఆసుపత్రి పేరుకే సూపరింటెండెంట్ అయినా ప్రిన్సిపాల్ పెత్తనం చెలాయిస్తూ అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. కొంత మంది ఏజెంట్లు పని స్థలాల్లో ఫొటోలు తీసి ప్రిన్సిపాల్‌కు పంపుతూ మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వారధి ద్వారా ఉద్యోగం పొందిన వారిని వేతనాలు ఇప్పించేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

కళ్యాణ్‌నగర్, జూన్ 29: మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు పిలుపునిచ్చారు. సేవా సప్తాహ కార్యక్రమంలో భాగంగా శనివారం గోదావరిఖని పవర్‌హౌస్ కాలనీలోని కాశీవిశ్వేశ్వర ఆలయ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటిని వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగామెడికల్ క్యాంపులు, పేద కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరాలతో పాటు ఆసుపత్రిలో చికిత్సలు చేయించడం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి యువకులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నగర కార్యదర్శి మ్యాడగోని రవీందర్, ఇనంపల్లి వెంకన్న, కాస సత్యనారాయణ, వెంకటస్వామి, బండ సమ్మన్న, శివ, ముప్పె సంపత్, లింగన్న, దిగంబర్, అరవింద్, చక్రపాణి, అనిల్ పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి'



ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కోల్‌సిటీటౌన్, జూన్ 29: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం గోదావరిఖనిలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ పెండింగ్ ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి కోర్సులు పూర్తి చేసిన కూడా వారి సర్టిఫికెట్లు కళాశాలల యాజమాన్యాలు ఇవ్వడం లేదన్నారు. అసెంబ్లీలో విద్యార్థుల సమస్యలపై తప్పకుండా మాట్లాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొలుగూరి సోను, ఎల్కపల్లి సురేష్, గొడిసెల ప్రణీత్, దనాల దినేష్, కల్వల సునీల్, దీపక్, శివ, అభిరాజ్, సృజన్, యూసఫ్ పాల్గొన్నారు.



ఏఎల్‌పీ గనిని సందర్శించిన డైరెక్టర్(ఆపరేషన్స్)



ఏఎల్‌పీ గని అధికారులతో డైరెక్టర్ శ్రీనివాస్

రామగిరి, జూన్ 29: సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీ గనిని శనివారం సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) శ్రీనివాస్ సందర్శించారు. గనిలోని పని స్థలాలను పరిశీలించారు. 3 సీఎమ్ పంచ్‌ఎంట్రీలో జరుగుతున్న పనులను పరిశీలన చేశారు. భద్రత పరమైన అంశాలను వివరిస్తూ పలు సలహాలు,సూచనలు చేశారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎంలు వెంకటేశ్వర్లు, సుధాకర్‌రావు, అధికారులు రాధాకృష్ణ, రాజేందర్, రఘురాం, జనార్ధన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

హైడ్రాలిక్ క్రేన్‌ను ప్రారంభించిన ఆర్‌జీ-2 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 29: ఆర్‌జీ-2 కృషి భవన్ షావల్స్ డ్రిల్ సెక్షన్ నందు 40టన్నుల సామర్థ్యం కలిగి, రూ.1.48కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన హైడ్రాలిక్ టైర్ మౌంటెడ్ క్రేన్‌ను ఆర్‌జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓసీపీ-3 ఉద్యోగుల మీద ఉన్న నమ్మకంతో సీఎండీ ఎన్ బలరాం, డైరెక్టర్లు అడిగిందే తడవుగా కొత్త వాహనాలను కొనుగోలు చేసి అందిస్తున్నారని, వారు మనకు అందించిన సహకారంతో యంత్రాలను పూర్తి పని గంటలు వినియోగిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ మధుసూదన్, ప్రాజెక్టు ఇంజనీర్ రాజాజీ, కాలరీ మేనేజర్ రమేష్, పిట్ సెక్రెటరీ ఎజ్జ రాజయ్య, శ్రావణ్ సెక్షన్ హెచ్‌ఓడీ జనార్ధన్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహ్మద్, వెల్ఫేర్ ఆఫీసర్ సురేందర్ పాల్గొన్నారు.

ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయండి

- ఆర్‌జీ-2 ఉపాధ్యక్షుడు అయిలి శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 29: కేంద్ర ప్రభుత్వం సింగరేణిలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయిస్తూ వేలం నిర్వహణను ఉపసంహరించుకోవాలని టీబీజీకేఎస్ ఆర్‌జీ-2 ఉపాధ్యక్షుడు అయిలి శ్రీనివాస్ అన్నారు. శనివారం యైటింక్లయిన్‌కాలనీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సింగరేణి వ్యాప్తంగా జూలై 1 తేదీన నల్ల బ్యాడ్జీల కార్యక్రమం, 3న తేదీన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం, 6న ఏరియా జీఎంలకు మెమోరాండం ఇవ్వడం, 9న గోదావరిఖని చౌరస్తాలో కార్మిక వర్గంతో పెద్దఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, కోల్‌బెల్ట్ ప్రాంత మాజీ ప్రజాప్రతినిదులు హాజరవుతారన్నారు. ఈ ధర్నాలో కార్మికవర్గం పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో మల్లేశ్వరరావు, బేతి చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, జాడి వెంకటి వెంకటేష్, రత్న రాజిరెడ్డి, బురికి రమేష్, రౌతు రాజు, నరేష్, జాబు తిరుపతి పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామమూర్తి



వర్కింగ్ ప్రెసిడెంట్ రామమూర్తి, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి

గోదావరిఖని, జూన్ 29: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) రాష్ట్ర కమిటీని శనివారం ఆ యూనియన్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి ప్రకటించారు. టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తిని ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా కే సురేందర్ రెడ్డిని ఎన్నుకున్నారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా నూనె కొమురయ్య, ఉపాధ్యక్షులుగా బడికెల సంపత్ కుమార్, ధరావత్ మంగీలాల్, జంగిలి రవీందర్, నల్లవెల్లి సదానందం, కుశన వీరభద్రం, సీహెచ్ ప్రభాకర్ రెడ్డిని ఎంపిక చేశారు. యూనియన్ అధికార ప్రతినిధిగా పర్లపల్లి రవి, కోశాధికారి ఎల్ వెంకటేష్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలుగా ఎండీ జాహిద్ పాషా, బండి రమేష్, ఓ రాజశేఖర్, ఎస్ రంగనాథ్, పింగిళి సంపత్‌రెడ్డిని ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శులుగా చెల్పూరి సతీష్, పానుగంటి సత్తయ్య, బేతి చంద్రయ్య, సిద్ధంశెట్టి సాజన్, దాసరి శ్రీనివాస్, కసికర్ల కిరణ్‌కుమార్, రత్నం అవినాష్, ఈ ప్రవీణ్ కుమార్‌లను నియమించారు. చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు చల్లా రవీందర్‌రెడ్డి, వొడ్నాల రాజయ్య, ఇందూరి సత్యనారాయణ, అనుముల సత్యనారాయణ, పొగకు రమేష్, మునిగల రమేష్‌బాబు, పొలాడి శ్రీనివాసరావు, వారణాసి గోరేపతి, ఇనుముల సత్యనారాయణలను ఎంపిక చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పెండ్రి అన్వేష్, సీహెచ్ వెంకట రమణ, కేవీ రామకృష్ణ, అబ్బు శ్రీనివాసరెడ్డి, షేక్ మస్తాన్, టీ రఘోత్తంరెడ్డి, బూర్గుల రవికుమార్, ఊరెడ్డి రమేష్, సప్పల రాజేశంతో పాటు 37మంది కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసినట్టు అధ్యక్షుడు రాజిరెడ్డి రాజిరెడ్డి వెల్లడించారు.

11డివిజన్ల ఉపాధ్యక్షులు వీరే...

సింగరణిలోని 11డివిజన్లకు శనివారం సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్లను ప్రకటించారు. బెల్లంపల్లి ఉపాధ్యక్షుడిగా మల్రాజు శ్రీనివాసరావు, మందమర్రి ఉపాధ్యక్షుడిగా మేడిపల్లి సంపత్, శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడిగా పెట్టం లక్ష్మణ్, ఆర్‌జీ-1 ఉపాధ్యక్షుడిగా వడ్డేపల్లి శంకర్, ఆర్‌జీ-2 ఉపాధ్యక్షుడిగా ఐలి శ్రీనివాస్, ఆర్‌జీ-3 ఉపాధ్యక్షుడిగా నాగెల్లి సాంబయ్య, భూపాలపల్లి ఉపాధ్యక్షుడిగా బడికెల సమ్మయ్య, మణుగూరు ఉపాధ్యక్షుడిగా నాగెల్లి వెంకటేష్, కొత్తగూడెం ఉపాధ్యక్షుడిగా గడప రాజయ్య, కొత్తగూడెం కార్పొరేట్ ఉపాధ్యక్షుడిగా తుమ్మ శ్రీనివాసరావు, ఇల్లందు ఉపాధ్యక్షుడిగా జాఫర్ హుస్సేన్‌లను ఎంపిక చేసినట్టు రాజిరెడ్డి తెలిపారు.

బొగ్గు నిక్షేపాలను ప్రైవేట్‌పరం చేస్తే సహించం

టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, జూన్ 29: తెలంగాణలోని బొగ్గు బ్లాకుల నుంచి ప్రైవేట్ వ్యక్తులు బొగ్గును తీసుకెళదామంటే ఊరుకునేది లేదని, తటెడు బొగ్గును కూడా తీయకుండా అడ్డుకుంటామని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భంలోని బొగ్గు, ఖనిజ నిక్షేపాలను ప్రైవేటు వ్యక్తులకు దారదత్తం చేస్తూ కాంగ్రెస్ ప్రారంభించిన దుర్మార్గమైన పద్ధతులకు బీజేపీ ప్రభుత్వం కూడా అమలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రైవేటీకరణ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కార్మికులు గమనించాలని ఆయన కోరారు. ఎం ఎండీఆర్-2015 చట్టాన్ని మూజువాని ఓటు ద్వారా బీజేపీ ప్రభుత్వం ఆమోదించుకున్నదని రాజిరెడ్డి చెప్పారు. బొగ్గు, ఇతర ఖనిజాల తవ్వకంపై బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని రాజ్యసభలో బీఆర్ఎస్ డిమాండ్ చేసిందని ఆయన వెల్లడించారు. దేశంలోని బొగ్గు పరిశ్రమల్లో కార్మికుల సంఖ్య గడిచిన పదేళ్లలో 60శాతానికి కుదించబడటం అప్పటి కాంగ్రెస్ ప్రధాని మన్మోహన్‌సింగ్ పుణ్యమేనని రాజిరెడ్డి ఆరోపించారు. బొగ్గు బ్లాకుల వేలం వేయటం అంటేనే బొగ్గు సంస్థల ప్రైవేటీకరణ అని రాజిరెడ్డి చెప్పారు. బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియకు వ్యతిరేకంగా పోరాటాలకు కలిసి వచ్చే కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలతో ఐక్యంగా ఉద్యమాలు నిర్వహిస్తామని రాజిరెడ్డి వెల్లడించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

ఈ విలేకరుల సమావేశంలో కార్మిక నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, కే సురేందర్ రెడ్డి, పర్లపల్లి రవి, జాహిద్ పాషా, పింగిలి సంపత్ రెడ్డి, చల్ల రవీందర్ రెడ్డి, జాఫర్ హుస్సేన్, పోలాడి శ్రీనివాస్, దూట శేషగిరి పాల్గొన్నారు.